ప్రజాశక్తి

సోమవారం 4 డిసెంబర్ 2023 | 5 | శ్రీ సత్యసాయి

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉషాశ్రీ చరణ్

విభిన్న ప్రతిభావంతుల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

మంత్రి ఉషశ్రీ చరణ్

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

విభిన్న ప్రతిభా వంతుల అభివృద్ధికి వైసిపి ప్రభుత్వం కట్టుబడి ఉందనిరాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి కెవి. ఉషాశ్రీచరణ్ అన్నారు. జిల్లాకేంద్రంలోని ఎస్ఎస్‌బిఎన్ కళాశాల ఆవరణంలోని రూసా అడిటోరియంలో ఆదివారం నిర్వహించిన అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల అభివృద్ధికి సిఎం జగన్మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. అనంతరం జిల్లా,రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన క్రీడలలో ప్రతిభ కనబరిచిన విభిన్న ప్రతిభావంతులకు మంత్రి మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేసి సన్మానించారు. అదే విధంగా వికలాంగులకు కృత్రిమ అవయవాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బిసిలు ఏకమైతేనే రాజ్యాధికారం సాధ్యం

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

బిసిలందరూ ఏకమై ఒకతాటిపై నడిస్తేనే రాజ్యాధికారం సాధ్యమని బిసి ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కొట్టాల శ్రీరాములు పిలుపునిచ్చారు. పట్టణంలోని సాయి ఆరామంలో ఆదివారం బిసి ఐక్యవేదిక ముఖ్య నాయకులు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. శ్రీరాములు మాట్లాడుతూ బిసిల్లో ఐక్యత లేకపోవడం, కులాల వారీగా విడిపోవడం వల్ల రాజ్యాధికారం దక్కడం లేదన్నారు. వివిధ కులా ల్లో ఉన్న బిసిలందరూ ఏకమైతే రాజ్యాధికారం పొందవచ్చన్నారు. అధిక సంఖ్యలో ఉన్న బిసిలను రాజకీయ పార్టీలు 'విభజించు- పాలించు' పద్ధతిలో విడదీస్తున్నాయన్నారు. రాజకీయ పార్టీలు బిసిలను ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తున్నాయని, కావున బిసిలు ఏకం కావాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు బిసి ఐక్యవేదిక ద్వారా రాజ్యాధికారం కోసం పార్టీలు, కులాలకు అతీతంగా బిసి నినాదంతో ముందుకుసాగాలన్నారు. త్వరలోనే జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో కమిటీల ఏర్పాటు, జిల్లా కేంద్రంలో భారీ బహిరంగసభ నిర్వహించేలా బిసిల ఐక్యవేదిక కృషి చేస్తుందన్నారు. బిసిలకు అధిక ప్రాధాన్యమిచ్చే పార్టీలకే మద్దతు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. అనంతరం బిసి ఐక్యవేదిక జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కొట్టాల శ్రీరాములు, గౌరవాధ్యక్షులుగా సామకోటి ఆదినారాయణ, ఉపాధ్యక్షులుగా గపూర్‌ఖాన్, డాక్టర్ తిరుపతేంద్ర, ప్రధాన కార్యదర్శిగా పవన్‌కళ్యాణ్, కార్యదర్శిగా సుబ్రహ్మణ్యం, భూమిగాని రాజ శేఖర్, కమిటీ సభ్యుడిగా కోనప్ప ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికైన ప్రతినిధులు మాట్లాడుతూ బిసిల ఐక్యత, రాజ్యాధికారం కోసం కృషి చేస్తామన్నారు. సమావేశం లో కేశాని ఆదినారాయణ, శివానంద, హరికృష్ణ, కొండమ రాజు, ఈశ్వర్, నారా యణస్వామి, లక్ష్మీనారాయణ, పోతల రాజు, గంగాద్రి, సుధాకర్ పాల్గొన్నారు.

ఐక్యత చాటుతున్న బిసి ఐక్యవేదిక నాయకులు

హాజరు సగం.. సేవల్లో నిర్లక్ష్యం

నాలుగేళ్లు గడుస్తున్నా గాడిన పడని సచివాలయ వ్యవస్థ
ఎప్పుడొస్తారో, ఎంతకు వెళతారో తెలియని పరిస్థితి
సేవలందక ప్రజలు ఇబ్బందులు
పట్టించుకోని అధికారులు

6వ వార్డు సచివాలయంలో సిబ్బంది లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసి, సంక్షేమ పథకాల ఫలాలు అర్హులందరికీ అందించాలన్న సంకల్పంతో నాలుగేళ్ల కిందట రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను అమల్లోకి తెచ్చింది. ఈ వ్యవస్థ ఆశయాలు ఘనంగా ఉన్నా అమలులో ఇంకా బాలారిష్టాల్లోనే ఉంది. ఒక్కో సచివాలయంలో వివిధ శాఖలకు సంబంధించి 10 మంది పనిచేస్తున్నా ప్రజల సమస్యలు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉన్నాయి. అనేకచోట్ల అధికారులు అందు బాటులో ఉండటం లేదు. సచివాలయ వ్యవస్థ ద్వారా 540 రకాల సేవలను అందించాలని ప్రభుత్వం నిర్దేశించింది. అందులో సగం కూడా ప్రజలకు అందుబాటులోకి రావడం లేదు. కులం, ఆదాయం, మరణ, జనన వంటి ధ్రువీకరణ పత్రాలకు తహశీల్దారు కార్యాలయాలకే వెళ్లాల్సి వస్తోంది. సచివాలయ ఉద్యోగుల పని తీరు పరిశీలించాల్సిన అధికారులు చుట్టపు చూపుగా వచ్చి వెళుతున్నారు.. దీంతో సిబ్బంది ఆడిందే ఆట పాడిందే పాటగా తయారైంది.

10 మంది ఉండాల్సిన చోట ఇద్దరే విధులు నిర్వర్తిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం మున్సిపాలిటీ పరిధిలోని 43 సచివాలయాలు ఉన్నాయి. వీటిలో 387 మంది సిబ్బంది ఉండాల్సుండగా 287 మంది పనిచేస్తున్నారు. వంద పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆయా సచివాలయాల్లో సిబ్బంది పనితీరుపై పలు విమర్శలు ఉన్నాయి. పనితీరులో నిర్లక్ష్యం వహిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. దీంతో వివిధ పనుల నిమిత్తం సచివాయానికి వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సచివాలయ తనిఖీకి వచ్చే అధికారులు ముందస్తు సమచారం ఇస్తుండడతో ఖచ్చితంగా సిబ్బంది అంతా కనిపిస్తారని అయితే ప్రజలకు మాత్రం వారి సేవలు నామ మాత్రమేనని ఆయా ప్రాంతాల ప్రజలు వాపోతున్నారు. పురపాలక సంఘ కార్యలయానికి పక్కనే ఉన్నా భవనంలో రెండు సచివాలయాలు ఉన్నాయి. ఇందులో ఏ సమయానికి వెళ్లిన పూర్తి స్థాయిలో కార్యదర్శులు ఉండరు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి ప్రతి కార్యదర్శి అందుబాటులో ఉండి స్పందన కార్యక్రమాన్ని నిర్వహించాలన్న నిబందనలు ఉన్నా వాటిని పాటించడం లేదు. మున్సిపల్ కార్యాలయం పక్కన ఉన్న సచివాలయం పరిస్థితి ఇలా ఉంటే ముదిరెడ్డిపల్లిలో ఉన్న 36, 37, 38 వార్డు సచివాలయాలు, మోత్కుపల్లి, మోడాల్ కాలనీ, కొట్నూరు, ఇతర మురికి వాడల్లో ఉన్నా సచివాలయాల పరిస్థితి ఏలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఇక మహిళా పోలీసులు అయితే వారు ఏ విధులు నిర్వహిస్తున్నారో ఎవరికి తెలీదు. పారిశుధ్య నిర్వహణ కోసం ప్రత్యేక కార్యదర్శి ఉన్నప్పటికి ఎక్కడి మురుగు అక్కడే అన్న చందంగా ఉంది. వార్డు స్థాయిలో ప్లానింగ్ కార్యదర్శులు ఉన్న అక్రమ నిర్మాణలు ఆగడం లేదు. ఇక వెల్ఫేర్ కార్యదర్శులకు అయితే నూతన పింఛన్లు, చేయూత లాంటి పథకాలు మంజురు అయితే ఇక వారికి పండగే. ఇక ఆయా కార్యదర్శులు వారి స్థాయికి తగ్గట్టు అవినీతికి పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినపిస్తున్నాయి.

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే నోటీసులు ఇస్తాం

పురపాలక సంఘ వ్యాప్తంగా సచివాలయ ఉద్యోగులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే నోటీసులు ఇస్తాం. సక్రమంగా విధులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారికి నోటీసులు ఇచ్చాం. పురపాలక సంఘంలో కొంత మంది అధికారులను సచివాలయాల పర్యవేక్షణ అధికారులుగా నియమించాం. ఇకపై సచివాలయాలను ఆకస్మిక తనిఖీ చేస్తాం. అందుబాటులో లేని వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటాం.

ప్రమోద్ కుమార్,
మున్సిపల్ కమిషనర్ , హిందూపు

రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సాయి కౌస్తువ్ దాస్ గుప్తా

పుట్టపర్తి వాసికి రాష్ట్రపతి అవార్డు

ప్రజాశక్తి పుట్టపర్తి క్రైమ్

అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ఆదివారం జరిగిన ప్రతిష్టాత్మక వేడుకల్లో దివ్యాంగజన్ 2023 సాధికారత కోసం జాతీయ అవార్డును పుట్టపర్తికి చెందిన సాయి కౌస్తువ్ దాస్‌గుప్తాకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రదానం చేశారు. కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రి డాక్టర్ వీరేంద్ర కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత రాష్ట్ర మంత్రులు రాందాస్ అథవాలే, ఎ. నారాయణస్వామి, ప్రతిమా భూమిక్ తదితరులు పాల్గొన్నారు. భారతదేశపు వీల్ చైర్ వారియర్ యాక్సెసిబిలిటీ, ఇన్‌క్లూజన్ రంగంలో తన అసాధారణమైన సహకారానికి గుర్తింపు పొందిన దాస్‌గుప్తా గ్లోబల్ టెడ్ ఎక్స్ మోటివేషనల్ స్పీకర్, 90 శాతం లోకోమోటర్ వైకల్యం ఉన్న వ్యక్తి. ఈయన దివ్యాంగజన్ విభాగంలో వ్యక్తిగత నైపుణ్యానికి జాతీయ అవార్డును అందుకున్నారు. ఆస్టియోజెనిసిస్ ఇంపెర్ఫెక్టా, చాలా అరుదైన పెళుసు ఎముక వ్యాధి, తీవ్రమైన వినికిడి లోపం వంటి సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ సాయి కౌస్తువ్ నాయకత్వ లక్షణాలతో ప్రపంచ చిహ్నంగా ఎదిగారు. అతని సానుకూల దృక్పథం, నైపుణ్యం ప్రపంచవ్యాప్తంగా విభిన్న ప్రేక్షకులపై శాశ్వత ప్రభావాన్ని చూపాయి. గిన్నిస్, లిమ్కా వరల్డ్ రికార్డ్‌లు కలిగి ఉన్న దాస్‌గుప్తా ఇప్పటి వరకు వివిధ వేదికలపై 500 పైన అవార్డులను అందుకున్నారు. ఆయన జీవిత కథ లక్షలాది మందికి స్ఫూర్తినిస్తుంది.

ఇంకా చేయాల్సింది ఉంది...

జనవరి మొదటివారంలో స్నాతకోత్సవం

'అనంత'జెఎన్‌టియు వైస్ ఛాన్సలర్ రంగజనార్ధన్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

'అనుకున్న దానిలో కొంత వరకు చేయగలిగాను...ఇంకా చేయల్సింది చాలానే ఉంది.' అని అనంతపురం జెఎన్‌టియు వైస్ ఛాన్సలర్ రంగ జనార్ధన్ పేర్కొన్నారు. తాను వైస్‌చాన్సలరుగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు విశ్వవిద్యాలయంలో తీసుకొచ్చిన మార్పులు, అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన తెలియజేశారు.

ప్రశ్న : ఉద్యోగ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు చేపట్టిన కార్యక్రమాల గురించి వివరించండి ?

విసి : వైస్ చాన్సలరుగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు విశ్వవిద్యాలయాన్ని అన్ని విభాగాల్లో ముందుకు తీసుకొచ్చే ప్రయత్నం చేశాను. ర్యాంకింగులో ఇప్పుడు అనంతపురం జెఎన్‌టియు వెయ్యిలోపు వచ్చేసింది. గతంలో వెయ్యిపైన ఉండేది. అదే విధంగా అన్ని విభాగాలకు ఎన్‌బిఎను సాధించగలిగాం. నాక్ సాధించేందుకు అవసరమైన ప్రక్రియను చేపట్టాం. త్వరలోనే అది కూడా వస్తుందని భావిస్తున్నాం.

ప్రశ్న : పరిశోధనలు, విద్యాబోధనలో ఏమైనా మార్పులు తీసుకొచ్చారా ?

విసి. అవును విద్యాబోధన, పరిశోధనల పెంపుదలకు చర్యలు చేపట్టగలిగాం. ప్రధానంగా పరిశోధనలు పెంచేందుకు చర్యలు తీసుకోవడమే కాకుండా జూనియరు అధ్యాపకులను ప్రోత్సహించేందుకు గానూ లక్ష రూపాయల సీడెడ్ ఫండ్‌ను కేటాయించాం. తద్వారా ముందుగా వారు పరిశోధనలపై ఆ నిధులతో దృష్టి సారించేందుకు వీలుంటుంది. ఆ తరువాత సంస్థలు ముందుకొచ్చి నిధులు కేటాయిస్తే వీటిని మరింత పెంచేందుకు వీలుంటుందని ఆ నిర్ణయం తీసుకున్నాం. విద్యాబోధనలోనూ అనేక మార్పులు తీసుకొచ్చాం. సాధారణంగా ఉండే సబ్జెక్టులతోపాటు ఆసక్తివున్న ఇతర సబ్జెక్టులను విద్యార్థులు అభ్యసించే విధంగా మార్పులు చేపట్టాం. అదే విధంగా విద్యార్థుల్లో నైపుణ్యం పెంచే కార్యక్రమాలు తీసుకొచ్చాం.

ప్రశ్న :మీ హయంలో మౌళిక సదుపాయలను ఏమైనా మెరుగు పరిచే చర్యలు తీసుకున్నారా ?

విసి : మౌళిక వసతులు కొన్ని పెంచగలిగాం. నూతన పరిపాలనా భవనం, కంప్యూటర్ సైన్సు విభాగం, లెక్చరర్ కాంప్లెక్సు, ఇండోర్ స్టేడియం, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, ఐదు నూతన భవన నిర్మాణాలను రూ.85 కోట్లతో చేపట్టాం. దాదాపు అన్నీ పూర్తికావచ్చాయి. వీటిని జనవరి రెండవ వారంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించాలని భావిస్తున్నాం.

ప్రశ్న :రెండు సంవత్సరాలుగా స్నాతకోత్సవం జరగలేదు. 13వ స్నాతకోత్సవం ఎప్పుడు జరగవచ్చు ?

విసి : త్వరలోనే స్నాతకోత్సవం నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే ఛాన్సలర్ అయిన రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీనర్‌గారిని కలిశాం. ఆయన జనవరి మొదటి వారంలో సమయమిచ్చి ఉన్నారు. ఆయన తేదీ ఖరారు చేసిన వెంటనే 13వ స్నాతకోత్సవాన్ని నిర్వహించనున్నాం. ఇప్పటికే నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు జరుగుతున్నాయి. నిర్వహణ కమిటీలను ఏర్పాటు చేశాం. ఏర్పాట్లు జరుగుతూ ఉన్నాయి.

ప్రశ్న : త్వరలో పదవీకాలం పూర్తికావస్తోంది.. మొత్తంగా ఈ బాధ్యతలు ఏ మేరకు సంతృప్తినిచ్చాయి ?

విసి : చాలా వరకు సంతృప్తికరంగానే ఉంది. అనుకున్న దానిలో కొంత వరకు చేయగలిగాం. ఇంకా చేయాల్సింది చాలానే ఉంది. అనంతపురం జెఎన్‌టియుకి ఒక సుదర్ఘమైన చరిత్ర ఉంది. అందుకు తగ్గట్టు మరిన్ని మార్పులు తీసుకురావాల్సి ఉంది. అనంతపురం జెఎన్‌టియుతో ముందు నుంచి అనుబంధముంది. దీని అభివృద్ధికి ఎళ్లవేళలా కృషి చేసే ప్రయత్నం చేస్తాను.

అనంతపురం జెఎన్‌టియు విసి రంగజనార్ధన్

ఫిబ్రవరి 2 నుంచి అనంత బాలోత్సవం

సమావేశంలో మాట్లాడుతున్న షమీమ్ షఫీవుల్లా

విద్యార్థులు ముందస్తు రిజిస్ట్రేషన్లు చేసుకోవాలి

బాలోత్సవం సన్నాహక సమావేశంలో నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

పిల్లల పండుగ అనంత బాలోత్సవాలు 2024 ఫిబ్రవరి 2, 3, 4 తేదిల్లో నిర్వహిస్తున్నట్లు అనంత బాలోత్సవ కమిటీ నాయకులు తెలిపారు. ఆదివారం స్థానిక ఎన్‌జిఒ హోంలో అనంత బాలోత్సవం-4 సన్నాహక కమిటీ సమావేశం నిర్వహించారు. అనంత బాలోత్సవ కమిటి కార్యదర్శి పి.శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి అనంత బాలోత్సవ కమిటీ చైర్మన్ షమీమ్ షఫీవుల్లా, కార్యనిర్వాహక కార్యదర్శి వి.సావిత్రి, కోశాధికారి మహమ్మద్ జిలాన్, కమిటీ సభ్యులు లింగమయ్య, సుబ్బరాయుడు, ప్రజ్ఞా సురేష్, పొట్లూరి హరిక్రిష్ణ, మధురశ్రీ, ఎజి.రాజమోహన్, విజయసాయి కుమార్, ఓ.నల్లప్ప తదితరులు హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అనంత బాలోత్సవాలు ప్రత్యేకతను చాటుకున్నాయని, పిల్లల మానసికోల్లాసానికి, విజ్ఞాన వికాసానికి దోహదపడుతున్నాయని తెలిపారు. మూడు పర్యాయాలు బాలోత్సవాలు నిర్వహించామని, నిర్వహణలో ఏ ఏడాదికి ఆ ఏడాది లోటుపాట్లు సరిచేసుకుంటూ నిర్వహిస్తున్నామని చెప్పారు. ముందస్తుగా విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఆ మేరకు పాఠశాల యాజమాన్యం చర్యలు తీసుకోవాలని ఈవిషయంలో కమిటీ సభ్యులు చొరవ తీసుకోవాలని తెలిపారు. స్పాట్ రిజిస్ట్రేషన్లతో సమస్యలు ఉత్పన్నమవుతూ నిర్వహణకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. కావున ముందస్తుగానే ఏ ఈవెంట్స్‌లో పాల్గొంటారో స్పష్టం చేస్తూ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. నిర్వహణ బాధ్యతలను కమిటీ ఏదీ అప్పగించిన వారు సజావుగా పూర్తి చేసేందుకు తమ వంతు సహకారం అందిస్తామంటూ హాజరైన సభ్యులు తెలిపారు. అందరి ఆమోదం మేరకు ఫిబ్రవరి 2, 3,4 తేదీల్లో అనంతపురం నగరంలో బాలోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేదిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల మైదానం, ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏదో ఒక చోట బాలోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గత బాలోత్సవాల్లో తలెత్తిన సమస్యలు పునరావృతం కాకుండా వాటిని సవరించుకుని విజయవంతంగా నిర్వహించేందుకు పలువురు సూచనలు సలహాలు అందించారు. వారోత్సవాలు విజయవంతం కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అనంత బాలోత్సవం-4 కమిటీ సభ్యులు ఎజి.రాజమోహన్, డాక్టర్ ఎఎ.నాగేంద్ర, నారాయణనాయక్, శివారెడ్డి, షేక్ రియాజుద్దీన్, ఓన్నూర్‌కుమార్, అనిల్, శ్రీనివాసులు, నాగమణి, పల్లవి, రోహిణి, లక్ష్మీనారాయణ, శ్యామల, రాజేశ్వరి, తాడేపల్లి రామకృష్ణ, ఎంఎన్‌టి.రాజు, బాలరంగయ్య, సురేంద్ర, నిసార్ అహమ్మద్, లక్ష్మీనారాయణ, బిహెచ్.రాయుడు, దేవేంద్రమ్మ, జూటూరు షరీఫ్, పరమేష్, క్రిష్ణవేణి, రవిచంద్ర, ఎల్‌ఆర్.వెంకటరమణ, రామాంజినమ్మ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

7న 'సామాజిక సాధికార బస్సుయాత్ర' : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మడకశిర

పట్టణంలోని వైఎస్ఆర్ సర్కిల్‌లో ఈ నెల 7వ తేదీ 'సామాజిక సాధికార బస్సుయాత్ర' నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి తెలిపారు. బస్సుయాత్రపై ఆదివారం ఎమ్మెల్యే పట్టణంలోని పార్టీ కార్యాలయంలో తాలూకా పార్టీ పరిశీలకులు అశోక్‌కుమార్‌తో కలిసి అమరాపురం, మడకశిర, గుడిబండ, రొళ్ల, అగళి మండలా ల్లోని వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బస్సుయాత్రకు అన్ని మండలాల నుం చి పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమా నులు పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కుంచిటి ఒక్కలిగ ఛైర్మన్ నళిని రంగయ్యగౌడ్, రొళ్ల జడ్పిటిసి అనంతరాజు, గుడిబండ ఎంపిపి రాధమ్మ, కొంకల్లు శివకుమార్, ప్రజాప్రతిని ధులు, డైరెక్టర్లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

సంక్షోభంలో విద్యారంగం

యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్

ప్రజాశక్తి-హిందూపురం

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యా విధానంతో ప్రభుత్వ విద్యారంగం సంక్షోభంలో కొట్టుమిట్టాడుతుందని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ విమర్శించారు. పట్టణంలోని సప్తగిరి కళాశాలలో ఆదివారం యుటిఎఫ్2వ జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించగా యుటిఎఫ్ నాయకులతో పాటు జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి డాక్టర్ ఇటి రామ్మూర్తి, అధ్యక్షులు రామకృష్ణ, పట్టు రైతు సంఘం రాష్ట్ర నాయకులు వెంకట్రామిరెడ్డి, ఎన్‌జిఒ అధ్యక్షులు నరసింహులు, ఒపిడిఆర్ రాష్ట్ర నాయకులు శ్రీనివాసులు పాల్గొని ప్రస్తుతం విద్యారంగంలో వస్తున్న మార్పులను వివరించారు. ప్రభుత్వాల విధానాల కారణంగా విద్యారంగం ప్రయివేటీకరణ వైపు అడుగులు వేస్తోంద న్నారు. పాలకుల అనాలోచిత విధానాల కారణంగా ఉపాధ్యాయులు హక్కులు, ఆర్థిక ప్రయోజనాలు కోల్పోతున్నారన్నారు. ఒపిఎస్, ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిలు, డిఎలు, పిఎఫ్‌లు, తదితర సమస్యల ఊసే లేదని విమర్శించారు. విలీనం పేరుతో పాఠశాలలను మూసివేయడం తగదన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా చర్చించి, భవిష్యత్తు కర్తవ్యాలను రూపొందించేందుకు యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించామన్నారు. ప్రజానాట్యమండలి కళాకారులు ఉద్యమ గీతాలు ఆలపించారు. నబిరసూల్ మ్యాజిక్ షోను ప్రదర్శించారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా శెట్టిపి జయచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎం.సుధాకర్, గౌరవాధ్యక్షులుగా ఎం.భూతన్న, సహాధ్యక్షులుగా జిహెచ్.బాబు, సీతాలక్ష్మి, కోశాధికారిగా డి.శీనివాసులు, రాష్ట్ర కౌన్సిలర్‌గా మారుతి, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా మహంతీశ్వర్‌తో పాటు 8 మంది జిల్లా కార్యదర్శులు, ఇద్దరు రాష్ట్ర కౌన్సిలర్లను ఎంపిక చేశారు. సమావేశంలో యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న యుటిఎఫ్ నూతన కార్యవర్గం

యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా జయచంద్రారెడ్డి

శెట్టిపి జయచంద్రారెడ్డి

ధర్మవరం టౌన్ : యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా శెట్టిపి జయచంద్రారెడ్డి రెండోసారి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. హిందూపురంలో ఆదివారం జరిగిన యుటిఎఫ్ సర్వసభ్య సమావేశంలో ఎన్నుకున్నారు. జయచంద్రారెడ్డి మాట్లాడుతూ యుటిఎఫ్ ఉపాధ్యాయుల సమస్యలపై రాజీలేని పోరాటం నిరంతరం కొనసాగిస్తుందని తెలిపారు. తనను రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు సహాయ, సహకారాలు అందించిన జిల్లా యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. వీరి ఎంపిక పట్ల ధర్మవరం జోన్ యుటిఎఫ్ నాయకులు రామకృష్ణనాయక్, హరికృష్ణ, ఆంజనేయులు, లక్ష్మయ్య, సాయిగణేష్, రామాంజనేయులు, గోపాలరెడ్డి, శివయ్య, అమర్‌నాథ్‌రెడ్డి, సురేష్, జనార్ధన్‌బాబు, మల్లేష్, చంద్రశేఖర్, డి.రామాంజనేయులు, శివారెడ్డి, రాంప్రసాద్, నాగేశ్వర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

అన్ని మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలి

6న రైతుసంఘం ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

జిల్లాలోని అన్ని మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 6వ తేదీ అన్ని మండల కార్యాలయాల వద్ద ధర్నా చేస్తున్నట్లు సిపిఎం అనుబంధ వ్యవసాయ శాఖ జిల్లా కార్యదర్శి జంగాల పల్లి పెద్దన్న తెలిపారు. పట్టణంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల వల్ల జిల్లా వ్యాప్తంగా రైతులు పూర్తిస్థాయిలో పంటలను కోల్పోగా 32 మండలాలకు గానూ 21 మండలాలను మాత్రమే కరువు ప్రాంతాలుగా ప్రకటించడం విచారకరమన్నారు. దీంతో మిగిలిన మండలాల రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేసినట్లు అయిందన్నారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి జిల్లాలోని అన్ని మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించడంతో పాటు జిల్లాకు మరో రూ. 50 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. వేరుశనగ రైతులకు ఎకరాకు రూ. 35 వేల చొప్పున పరిహారం, పంటల సాగుకు విత్తనాలు, ఎరువులు, ఎకరాకు పెట్టుబడి సాయం రూ. 25 వేలు కేటాయించాలన్నారు. హంద్రీనీవా ద్వారా అన్ని చెరువులను నీటితో నింపాలన్నారు. స్మార్ట్ మీటర్ల నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, లేనిచో రైతు సంఘం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు నామాల నాగార్జున, మారుతి, అయూబ్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

తెలంగాణలో కాంగ్రెస్ విజయంపై సంబరాలు

ప్రజాశక్తి-మడకశిర

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం పట్ల జిల్లా వ్యాప్తంగా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. ఎక్కడికక్కడ ర్యాలీలు చేపట్టి బాణసంచా పేల్చి మిఠాయిలు పంచిపెట్టారు. సిడబ్ల్యుసి మెంబర్ ఎన్.రఘువీరారెడ్డి కూడా తెలంగాణలో ప్రచారం చేసి కాంగ్రెస్ విజయానికి ఎంతో కృషి చేశారు. మడకశిర పట్టణంలో మాజీ ఎమ్మెల్యే సుధాకర్ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ సర్కిల్ నుంచి రాజీవ్ గాంధీ విగ్రహం వరకూ ర్యాలీ నిర్వహించి అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మంజునాథ్, ప్రభాకర్ రెడ్డి, బూదిపల్లి నాగభూషణ, శంకర్‌రెడ్డి, బాబు, సదాశివ, నాయకులు పాల్గొన్నారు. గుడిబండ మండలంలో కన్వీనర్ దిన్నే హట్టి నాగరాజు ఆధ్వర్యంలో బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. ప్రత్యేక తెలంగాణ ఇచ్చిన పదేళ్ల తర్వాత తెలంగాణ ప్రజానీకం సోనియాగాంధీ రుణం తీర్చుకున్నారని డిహెచ్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎంఆర్ హనుమంతు తెలిపారు. హిందూపురం పట్టణంలో ఆ పార్టీ నాయకులు ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్, ఇందిరాగాంధీ సర్కిళ్లలో బాణసంచా పేల్చి, స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమాల్లో నాయకులు బాలాజీమనోహర్, కాలవ హరిత, షాహిద్, కలీం, రాధమ్మ, హనుమంతరాయప్ప, ఎండి ఇలియాజ్, ఎంఆర్ ఇలియాజ్, శ్యామ్‌కిరణ్, తదితరులు పాల్గొన్నారు. ధర్మవరం పట్టణంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి రంగన అశ్వర్థనారాయణ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్‌లో బాణసంచా పేల్చి అనంతరం బైక్ ర్యాలీ నిర్వహించారు. అలాగే పుట్టపర్తి పట్టణంలో పార్టీ సంయుక్త కార్యదర్శి పఠాన్‌గౌస్‌ఖాన్, పట్టణ కన్వీనర్ పుట్ల గంగాద్రి ఆధ్వర్యంలో బణాసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. కదిరి పట్టణంలో నియోజకవర్గ నాయకులు బొగ్గటి ముని కుమార్ ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. కొత్తచెరువులో కాంగ్రెస్, టిడిపి నాయకులు కలిసి స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఎన్టీఆర్, మాజీ ప్రధాని నెహ్రూ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే ముదిగుబ్బ, లేపాక్షి, అమరాపురం, రొద్దం, గోరంట్ల, సోమందేపల్లిలో ఆ పార్టీ శ్రేణులు ర్యాలీలు నిర్వహించి బాణసంచా పేల్చి మిఠాయిలు పంచి పెట్టారు.

మడకశిరలో సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-లేపాక్షి

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు డిమాండ్ చేశారు. స్థానిక ఓ ప్రయివేట్ ఫంక్షన్ హాలులో ఆదివారం ఎఐటియుసి అనుబంధ సంఘం అంగన్వాడీ వర్కర్స్, సహాయకుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీ సమ్మెకు సంబంధించి కరపత్రాలు విడదల చేశారు. ముఖ్య అతిథి ఆంజనేయులు మాట్లాడుతూ అంగన్వాడీలకు కనీస వేతనం రూ. 26 వేలు, గ్రాట్యుటీ, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్పు, మినీవర్కర్లకు ప్రమోషన్లు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రూ. 5 లక్షలు, వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని, హెల్పర్ల వయో పరిమితి 50 ఏళ్లకు పెంపు, రాజకీయ జోక్యం అరికట్టాలని, పెండింగ్‌లో సెంటర్ అద్దెలు, టిఎ బిల్లులు, ఇతర బకాయిలు, వేతనంతో కూడిన మెడికల్ లీవులు, సంక్షేమ పథకాల అమలు, తదితర డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వినోద్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు గోవిందు, సిపిఐ మండల కార్యదర్శి శివప్ప, నాయకులు నారాయణరెడ్డి, గౌతమ్‌కుమార్, అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా కన్వీనర్ సంపూర్ణమ్మ, అంగన్వాడీలు దేవి, షమీరాబేగం, హెల్పర్లు భాగ్యమ్మ, రాజేశ్వరి, జయమ్మ, కవిత, యశోద, జయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్

యుటిఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శిగా సుధాకర్

పెనుకొండ : యుటిఎఫ్ జిల్లా 2వ కౌన్సిల్ సమావేశంలో ఆదివారం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అందులో జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎం.సుధాకర్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. జిల్లా కార్యదర్శిగా జిసి.నరేష్‌కుమా ర్, జిల్లా మహిళా కమిటీ కన్వీనర్‌గా హసీనా బేగంను ఎన్నుకున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం..సుధాకర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

నేడు 'స్పందన' రద్దు

పుట్టపర్తి అర్బన్ : ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే జగనన్నకు చెబుదాం స్పందన గ్రీవెన్స్ కార్యక్రమాన్ని ఈ సోమవారం (నేడు) రద్దు చేసినట్లు కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. ఈ మేరకు ఆదివారం కలెక్టరేట్ నుంచి ఓ ప్రకటన విడుదలైంది. అనివార్య కారణాల వల్ల జిల్లా స్థాయి స్పందన కార్యక్రమాన్ని రద్దు చేశామని, ప్రజలు గమనించాలని తెలిపారు.

కింగ్స్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు

పుట్టపర్తి రూరల్ : మండల పరిధిలోని కర్నాటక నాగేపల్లి కింగ్స్ చర్చిలో ఆదివారం పాస్టర్ ఎం.అరుణ్‌కుమార్, పాస్టర్ సలోమి కొవ్వొత్తి వెలిగించి క్రిస్మస్ ప్రార్ధనలను ప్రారంభించారు. మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లోని చర్చిల్లో కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. విద్యార్థులు, చిన్నపిల్లలతో యేసుక్రీస్తు జీవిత చరిత్రపై నాటికలు ప్రదర్శించారు. ప్రార్ధనల్లో పాస్టర్లు సురేష్, అజయ్, మాథ్యూస్ జాన్ బెనియన్, యేసురాజు, పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి

అమరాపురం : మండల పరిధిలోని వెలుగొండ గ్రామంలో ఆదివారం వాల్మీకి సేవా సంఘం ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి ఘనంగా నిర్వహించారు. ముందుగా దేవాలయం నుంచి వాల్మీకి చిత్రపటాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి చెరువు కట్ట కింద గంగపూజ నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో మల్లికార్జున, కాంతరాజు, గాదిరప్ప, వీరేష్, లోకేష్, శ్రీధర్, మహేష్, రఘు, మంజునాథ, తిప్పేస్వామి, రంగనాథ, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-మడకశిర

పట్టణంలోని సాయిబాబా ఆలయం ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించినట్లు డాక్టర్ దినకరన్ తెలిపారు. ఈ శిబిరంలో 48 మంది రోగులకు చికిత్సలు చేసి ఆపరే షన్ కోసం నంద్యాలలోని శాంతిరాం ఆసుపత్రికి సిఫారసు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం పేదలకు ఎంతో మేలు చేస్తుందని ప్రజలు డాక్టర్ దినకరన్ అభినందించారు. అమరాపురం పట్టణానికి చెందిన డాక్టర్ దినకరన్ అనంతపురంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చిన్న పిల్లల వైద్యుడిగా పని చేస్తు న్నారు. తన తండ్రి నరసింహప్ప వైద్యుడిగా సేవలు అందించారని ఆయన జ్ఞాపకార్థం గ్రామీణ ప్రాంతాల ప్రజల కు సేవ చేయాలనే ఉద్దేశంతో నియోజకవర్గ వ్యాప్తంగా ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి మందులు అందజే స్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే గుడిబండ, అమరాపురం, రొళ్ల, అగలి మండల కేంద్రాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామని తెలిపారు.

రోగులకు సలహాలు ఇస్తున్న డాక్టర్ దినకరన్

ఘనంగా ప్రపంచ వికలాంగుల దినోత్సవం

కదిరి అర్బన్ : పట్టణంలోని దివ్యాంగుల వసతి గృహంలో ఆదివారం ఖాద్రి లక్ష్మీనరసింహ స్వామి దివ్యాంగుల సంఘం అధ్యక్షులు సూర్య నారాయణాచార్య ఆధ్వర్యంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి దివ్యాంగులకు పంచిపెట్టారు. వారు మాట్లాడుతూ అర్హులైన దివ్యాంగులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రామాంజులు, లక్ష్మీదేవి, కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

మడకశిర: వికలాంగ విద్యార్థులతో యుటిఎఫ్ నాయకులు

మడకశిర : ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా యుటిఎఫ్ ఆధ్వర్యంలో నంజప్ప సౌజన్యంతో పరిగి మండలం సేవా మందిర్‌లో వికలాంగ విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.భూతన్న, జిల్లా కార్యదర్శి తాహిర్‌వలి, గుడిబండ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.నరసింహప్ప, టి.మూడ్ల గిరియప్ప, గౌరవాధ్యక్షులు ఇ.నరసింహమూర్తి, నరసింహరాజు, పాల్గొన్నారు.

గిరిజన ఉద్యోగులపై దాడులు అరికట్టాలి

ఆల్ ఇండియా గిరిజన ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షులు పివి.రమణ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాష్ట్రంలో గిరిజన ఉద్యోగులపై జరుగుతున్న దాడులు అరికట్టాలని ఆల్ ఇండియా గిరిజన ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షులు పివి.రమణ అన్నారు. ఆదివారం ఉపాధ్యాయ భవన్‌లో ఆ సంఘం ఆధ్వర్యంలో రాయలసీమ ప్రాంతీయ సదస్సు నిర్వహించారు. ఆల్ ఇండియా గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కె.అశోక్ నాయక్ అధ్యక్షతన నిర్వహించిన సదస్సుకు ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు పివి.రమణ, రాష్ట్ర అధ్యక్షుడు కె.సత్యనారాయణ హాజరై మాట్లాడారు. గిరిజన ఉద్యోగులపై దాడులు పెరుగిపోయాయని తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లా బుక్కపట్నం సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాసులు నాయక్‌పై ఏసిబి అధికారులు దాడులు చేసి ఆందోళనకు గురి చేశారని, దిక్కు తోచని స్థితిలో ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. గిరిజన ఉద్యోగులను టార్గెట్ చేసి ఇబ్బందులకు గురువుతున్నారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి బుక్కపట్నం సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాసులు నాయక్ మృతిపై సిబిసిఐడితో దర్యాప్తు చేయించి వాస్తవాలను వెల్లడించాలన్నారు. శ్రీనివాసులు నాయక్ కుటుంబానికి రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించి, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని, కుటుంబానికి పూర్తి పెన్షన్ అందేలా చూడాలన్నారు. బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చరాదన్నారు. పార్లమెంట్‌లో వచ్చే శీతాకాల సమావేశంలో బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు బిల్లు పెట్టే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలిసిందన్నారు. దీన్ని వ్యతిరేకిస్తూ ఇప్పటికే రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకి సంతకాల సేకరణ పత్రాలు అందజేసి నిరసన తెలిపామన్నారు. బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. గిరిజన ఉద్యోగులకు ప్రాధాన్యత పోస్టుల్లో నియమించి రాజ్యాంగం కల్పించిన హక్కులను అమలు చేయాలన్నారు. ఈ డిమాండ్‌లను ఏకగ్రీంగా సమావేశం తీర్మాణించింది. అనంతరం టిటిడి పాలక మండలి సభ్యులుగా ఎన్నికైన అశ్వర్థనాయక్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా గిరిజన ఉద్యోగుల సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు వైపి.నాగభూషణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.వెంకటరమణ నాయక్, అనంతపురం చైర్మన్ ఠాగూర్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.రామానాయక్, ప్రధాన కార్యదర్శి డి.రామాంజినేయులు, ఉపాధ్యక్షులు ఎస్.గోపాల్ నాయక్, చెన్నకేశులు, వెంకటనారాయణ, మహిళా అధ్యక్షురాలు శాంతాబాయి, సుగుణాబాయి, సుశీలబాయి, శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాల్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ మోహన్‌నాయక్, కర్నూలు జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి, జాయింట్ సెక్రటరీ ఆర్.నాగరాజు, కోశాధికారి వెంకటేశ్వర్లు, ఏఐబిఎస్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చక్రేనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గురునానక్ జయంతి వేడుకలు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలో ఆదివారం గురునానక్ జయంతి వేడుకలను సిఖ్ సత్ సంగత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఈద్గా సర్కిల్‌లో పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎపిపి ఇందాద్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ జబివుల్లా, ఆల్ ఇండియా టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షులు ఉర్ ఫారూక్ ఖాన్, పుర ప్రముఖులు, చేనేత కార్మిక నాయకులు ఎసి నాగరాజు, దండోరా నాయకులు ఆంజనేయులు, ఉబేదుల్లా హుసేన్‌తో పాటు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. వక్తలు మాట్లాడుతూ శాంతి సామరస్యం కోసం గురునానక్ చేసిన సేవలను కొనియాడారు. అనంతరం ప్రభుత్వ వైద్యశాల, ప్రశాంతి మందిరం వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సిఖ్ సత్ సంగత్ నాయకులు మోహిందర్‌జీత్‌సింగ్, పలవీందర్‌సింగ్, భగవాన్ సింగ్, సతపాల్ సింగ్, జర్నయిల్ సింగ్, జస్వంత్ సింగ్, టిప్పుసుల్తాన్ రక్త దాత సంఘం సభ్యులు షేక్‌షబ్బీర్, ముజ్జు, అజమతుల్లా ఖాన్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న సిక్కులు, ప్రజా సంఘాలు

బిఎల్ఒలతో ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ నరసింహులు

తప్పుల్లేని ఓటరు జాబితా తయారు చేయాలి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

తప్పులు లేని ఓటరు జాబితా తయారు చేయాలని ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ నరసింహులు బిఎల్ఒ లను ఆదేశించారు. పట్టణంలో బూత్ స్థాయిలో అధికారులు చేపట్టిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఓటరు జాబితాలో చనిపోయిన వారు, డబుల్ ఎంట్రీ, ఒకే ఇంట్లో 10 ఓట్ల కంటే ఎక్కువ ఉన్న వాటిపై నిఘా పెట్టాలని ఆదేశించారు. ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్లను చట్టప్రకారం మాత్రమే తొలగించేందుకు సిఫారసు చేయాలన్నారు. ప్రధానంగా జనవరి 2024 నాటికి 18 ఏళ్ల నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చు అన్నారు.

ఆర్డీటీ అండర్-11 మిక్స్‌డ్ జెండర్ సాఫ్ట్‌బాల్ పోటీలు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆర్డీటీ అండర్-11 మిక్స్‌డ్ జెండర్ సాఫ్ట్‌బాల్ జోన్-4 క్లబ్ పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా గ్రాస్ రూట్ లెవెల్ కో ఆర్డినేటర్ వంశీకృష్ణ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతిభ ఉన్న క్రీడాకారులను వెలికి తీయడమే ఈ పోటీల ముఖ్య ఉద్దేశమన్నారు. ఇందుకోసం జిల్లావ్యాప్తంగా 20 క్లబ్బులు ఏర్పాటు చేసి నాలుగు గ్రూపులుగా విభజించి పోటీలు నిర్వహించామన్నారు. వీరిలో విన్నర్స్, రన్నర్స్‌ను జిల్లాస్థాయి, సెంట్రల్, జోన్ లెవెల్‌కు అర్హత సాధించిన వారికి ఈనెల 9,10వ తేదీల్లో ఆర్డీటీ అనంత క్రీడా మైదానంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో బుక్కరాయసముద్రం క్లబ్, కడవకల్లు క్లబ్, కళ్యాణదుర్గం క్లబ్, అనంత క్లబ్, నార్పల క్లబ్ జట్లు పోటీపడ్డాయి. వచ్చిన క్రీడాకారులకు పీడీ గోపాల్‌రెడ్డి మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో ఎపి సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సీఈవో వెంకటేశులు, అసోసియేషన్ కార్యదర్శి నాగేంద్ర, బుక్కరాయసముద్రం పీడీ గోపాల్‌రెడ్డి, అఫీషియల్స్ సింహాద్రి, శివ, షాకీర్, మహేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వసుంధర, ఉపాధ్యాయ బృందం సాఫ్ట్‌బాల్ సభ్యులు వెంకటేశులు, నాగేంద్ర, బుక్కరాయసముద్రం క్లబ్ క్రీడాకారులు పాల్గొన్నారు.

బాధితులకు 'గుండుమల' పరామర్శ

మడకశిర : మండల పరిధిలోని మనూరు పంచాయతీ ఉప్పిడిపల్లి గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు హనుమంతరాయప్ప భార్య సునందమ్మ కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ బెంగళూరులోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందు తోంది. అలాగే తురకవాండ్లపల్లి నారాయణప్ప మనవరాలు అదే ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. దీంతో నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి వారిని పరామర్శించారు. ఆయన వెంట కల్లుమర్రి సర్పంచి, క్లస్టర్ ఇన్‌ఛార్జి నాగరాజు, నాయకులు బజ్జి, రంగనాథ్, వీరక్యాతప్ప, లక్ష్మీపతి, నారాయణ, శివ, తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో బాధితులను పరామర్శిస్తున్న గుండుమల తిప్పేస్వామి

జమ్మానిపల్లిలో టిడిపి 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

మడకశిర : మండల పరిధిలోని జమ్మానిపల్లి గ్రామంలో ఆదివారం టిడిపి, జనసేన పార్టీల నాయకులు 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వారు ఇంటింటికీ వెళ్లి టిడిపి-జనసేన ప్రభుత్వం అధికారంలోకి వస్తే అమలు చేసే సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అలాగే మేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బూత్ కన్వీనర్ ముత్యాలప్ప, మండల మైనార్టీ అధ్యక్షుడు మహబూబ్‌బాషా, నాయకులు శివప్ప, సురేష్, తిరుమలేష్, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మురళి బాబు, తదితరులు పాల్గొన్నారు.

మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

నేడు ఓంకారేశ్వరునికి లక్ష బిల్వపత్రాలతో సేవ

బత్తలపల్లి : స్థానిక లలితా త్రిపుర సుందరీ సమేత ఓంకారేశ్వరస్వామి ఆలయంలో సోమవారం(నేడు) లక్ష బిల్వపత్రాలు, పుష్పాలతో పూజలు చేస్తున్నట్లు ఆలయ శాశ్వత ధర్మకర్త, ఎపి కురుబ కార్పొరేషన్ ఛైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు, జడ్పిటిసి కోటి సుధ పేర్కొన్నారు. బత్తలపల్లిలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ కార్తీక మాసం సందర్భంగా సాయంత్రం 5 గంటలకు ఓంకారేశ్వరస్వామికి లక్ష బిల్వపత్రాలు, పుష్పాలు అర్పిస్తామ న్నారు. భక్తులు వీలైనన్ని బిల్వ పత్రాలు, పుష్పాలు తీసుకొచ్చి పూజల్లో పాల్గొనాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

గాండ్లపెంట : ఓటరు నమోదు ప్రక్రియలో భాగంగా ఆదివారం కదిరి ఆర్‌డిఒ వంశీకృష్ణ మండల పరిధిలోని గాండ్లపెంట, మల్లమీదపల్లి, కటారుపల్లి, కురుమామిడి, తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించా రు. ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలన్నారు. మరణించిన వారి ఓట్ల తొలగింపు ప్రక్రియను పక్కాగా చేపట్టాలని బిఎల్ఒలను ఆదేశించారు. ఆయన వెంట ఆర్ఐ మున్వర్, బిఎల్ఒలు భవానీ, శివశంకర్, రియాజ్, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్న ఎన్నికల అధికారులు

ఓటరుగా నమోదు చేసుకోండి

బత్తలపల్లి : అర్హులైన వారందరూ ఓటరుగా పేర్లు నమోదు చేసుకోవాలని సూపర్‌వైజర్ ఎఎస్ డాక్టర్ లక్ష్మీనరసింహ శర్మ తెలిపారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఆదివారం ఆయన మండల పరిధిలోని మాల్యవంతం, యర్రాయపల్లి, బత్తలపల్లి గ్రామాల్లోని ఓటరు నమోదు కేంద్రాలను పరిశీలించారు. ఫారం-6, 7, 8 దరఖాస్తులను భర్తీ చేసే విషయంలో అశ్రద్ధ చూపకుండా ఖచ్చితమైన సమాచారం పొందుపరచాలని బిఎల్‌ఒలకు సూచించారు. అలాగే అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించాలన్నారు. మండల వ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో బిఎల్ఎలు ఈ స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొంటున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ లక్ష్మీనరసింహశర్మ

లేపాక్షి : ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా శని, ఆదివారాల్లో స్పెషల్ క్యాంప్ నిర్వహించినట్లు తహశీల్దార్ తెలిపారు. ఇందులో భాగంగా నూతన ఓటరు నమోదు, చనిపోయిన, శాశ్వతంగా ఊరు వదిలి వెళ్లిన వారు, డబుల్ ఎంట్రీ ఓట్లు తొలగింపు చర్యలు చేపట్టామని తెలిపారు.

ప్రమాదపుటంచున విద్యుత్‌స్తంభం

వాలిన విద్యుత్ స్తంభం

బత్తలపల్లి : మండల పరిధిలోని గుమ్మల్లకుంట గ్రామం తాగునీటి స్కీం బోరు వద్దకు వెళ్లే విద్యుత్ స్తంభం ఓ వైపు ఒరిగి కూలడానికి సిద్ధంగా ఉంది. ఈ స్తంభం జాతీయ రహదారి పక్కనే ఉంది. రైతు నారాయణరెడ్డి పొలంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి స్కీం బోరుకు హైటెన్షన్ విద్యుత్ వైర్లు ఏర్పాటు చేశారు. విద్యుత్ స్థంభం ఓ వైపు ఒరిగిపోయిందని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాన్ని సరిచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మహారాజశ్రీ గౌరవనీయులైన సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, కదిరి
I.P.NO:14/2022

Between:
మునిమడుగు నాగప్ప S/o Late M. పెద్దన్న, వయస్సు 70 సం॥లు హిందూ రిటైర్డ్ టీచర్, D.No:1-1286-86-A, అడపాల వీధి, కదిరి టౌన్, శ్రీ సత్యసాయి జిల్లా. ...పిటీషనర్

మరియు

బొంత భాస్కర రెడ్డి మరియు ఇతరులు ...రెస్పాండెంట్స్

To
R4: C.నాగభూషణ S/o C.నరసింహులు, వయస్సు 62 సం॥లు హిందూ, రిటైర్డ్ టీచర్,R/o D.No:1-1135-56-E, అడపాల వీధి, నియర్ పంచాయతి ఆఫీసు, కదిరి టౌన్, శ్రీ సత్యసాయి జిల్లా.

రెస్పాండెంట్ నెం:4 నోటీసు

ఇందుమూలంగా తెలియజేయడము ఏమనగా పైన తెలిపిన పిటిషనరు, రెస్పాండెంట్స్ పై ఐ.పి.14/2022 అనే పిటిషన్ వేయడమైనది. కోర్టు వారి ఉత్తర్వు మేరకు రెస్పాండెంట్ నెం.4కు నోటీసు జారి నిమిత్తము వాయిదా తేది. 11/12/2023 వ తేదిన ఉదయం 10:30 గంటలకు పైన తెల్పిన కోర్టు నందు ప్రత్యక్షంగా గాని పరోక్షముగా గాని హాజరు అయి అభ్యంతరములు, వాదనలు ఉన్న యెడల కోర్టు వారి ఎదుట తెలియపరచుకోగలరు. అట్లు హాజరు కాని యెడల ఐ.పి.పిటీషన్ నీ యొక్క పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:11/12/2023
స్థలం:కదిరి

ఎ.క్రిష్ణమూర్తి ఎమ్.ఎ., ఎల్.ఎల్.బి,
పిటిషనరు తరుపు న్యాయవాది, కదిరి.
సెల్:9440310692, 8886389692

మహారాజశ్రీ గౌరవనీయులైన అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి, కదిరి
O.S.NO:828/2022

Between:
కె.సౌజన్య D/o K.రామక్రిష్ణ, వయస్సు 43 సం॥లు హిందూ వ్యవసాయము, R/o D.No:167-1B, R.P. వీధి, కదిరి టౌన్, శ్రీ సత్యసాయి జిల్లా. ...వాది

మరియు

కాసబత్తిని శ్రీనివాసులు S/o Late K.గంగయ్య, వయస్సు 42 సం॥లు, హిందూ వ్యాపారము D.No:3-27-A-4-1, కోనేరు వీధి, కదిరి (పోస్టు మరియు టౌన్) శ్రీ సత్యసాయి జిల్లా. ...ప్రతివాది

ప్రతివాదికి దావా సమను

ఇందుమూలంగా తెలియజేయడము ఏమనగా పైన తెలిపిన వాది, ప్రతివాదిపై ప్రాంసరి నోటు వసూలు నిమిత్తం పై కోర్టు నందు దావా వేసియున్నారు. పై దావా వాయిదా తేది:05/01/2024న ఉదయం 10:30 గం॥లకు నీవు స్వయంగ గాని లేదా వకీలు ద్వారా గానీ హాజరు అయి అభ్యంతరములు, వాదనలు తెలియపరచుకోగలరు. అట్లు హాజరు కాని యెడల పై దావా నీ యొక్క పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:05/01/2024
స్థలం:కదిరి

ఎ.క్రిష్ణమూర్తి ఎమ్.ఎ., ఎల్.ఎల్.బి,
వాదితరుపు న్యాయవాది, కదిరి.
సెల్:9440310692, 8886389692

మహారాజశ్రీ గౌరవనీయులైన అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి, కదిరి
దావా NO:708/2022

Between:
Shaik Gousif Ahmmad S/o Baba Fakruhoddin, aged about 30 years, Muslim, Sinecure R/o Ameer Nagar, Opp to Railway Track, Kadiri, Teachers Colony, Kadiri Town, Sri Sathya Sai Dist. A.P.State. 966758698 ...వాది Plaintiff

AND

Syed Shabana W/o Shaik Gousif Ahammad D/o Syed Gouse Mohiddin, aged about 26 years, Muslim, House wife, R/o D.No:1582, Ist Main Road, 10 th word, Bapuji nagar, Gudibanda Chikballapur (Dist) karnataka Start ...ప్రతివాది

ప్రతివాదికి దావా సమను ...Defendant (ప్రతివాది)

ఇందుమూలంగా తెలియజేయడము ఏమనగా పైన తెలిపిన వాది, ప్రతివాది పై తెలిపిన కోర్టు నందు విడాకులు కోసం దావా వేసి యున్నారు. పై దావాలో ప్రతివాది యొక్క హాజరు నిమిత్తం 22/12/2023న ఉదయం 10:30 గం॥లకు పై కోర్టు నందు నీవు ప్రత్యక్షంగా గాని పరోక్షముగా గాని హాజరు అయి ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకోగలరు అని తెలియజేయడమైనది. అట్లు హాజరు కాని ఎడల పైన తెల్పిన దావా నీ యొక్క పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:22/12/2023
స్థలం:కదిరి

ఎ.క్రిష్ణమూర్తి ఎమ్.ఎ., ఎల్.ఎల్.బి,
వాదితరుపు న్యాయవాది, కదిరి.
సెల్:9440310692, 8886389692